క్లుప్తంగా

నియామక పత్రాలు అందజేసిన మంత్రి సురేష్


ఆయాకు నియామక పత్రం అందజేస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

పుల్లలచెరువు: మండలంలోని నాయుడుపాలెం, కవలకుంట్ల, మర్రివేముల అంగన్‌వాడీ ఆయా పోసులకు సంబంధించి నియామక పత్రాలు రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ శనివారం తన క్యాంపు కార్యాలయంలో ముగ్గురు మహిళలకు అందజేశారు. ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, పీఏసీఎస్ ప్రెసిడెంట్ ఆలవాల గాలిరెడ్డి పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో నిఖిల్‌రెడ్డికి 326వ ర్యాంకు


నిఖిల్‌రెడ్డి

పొదిలి: పాలిటెక్నిక్ పోటీ పరీక్షల్లో పొదిలికి చెందిన విద్యార్థి నర్రావుల సాయి నిఖిల్‌రెడ్డి రాష్ట్ర స్థాయి 326వ ర్యాంకు పొందాడు. టెక్నికల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి నిర్వహించిన పాలిసెట్ పరీక్షల్లో 120 మార్కులకు గాను 110 మార్కులు సాధించాడు. స్థానిక ఎస్ఆర్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన నిఖిల్‌రెడ్డి ఈ ర్యాంకు పొందాడు. ఎస్ఆర్ సెంటర్‌లో శిక్షణ పొందిన మరో ఆరుగురు 100కు పైగా మార్కులు సాధించారని సెంటర్ డైరెక్టర్ ఎస్.ఎన్.రాజన్ చెప్పారు. ర్యాంకు పొందిన విద్యార్థులను రాజన్, ఉపాధ్యాయులు అభినందించారు.

డీఎస్పీని కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు


డీఎస్పీతో వైఎస్సార్ సీపీ నాయకులు

దొనకొండ: దర్శి సబ్ డివిజన్ పోలీస్ ఆఫీసర్ అశోక్‌వర్ధన్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్‌లు శనివారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఘనంగా సన్మానించారు. దర్శి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కేశనపల్లి నాగేశ్వరరావు, గర్నేపూడి కృపాసుధాకర్, ప్రసన్నకుమార్ ఉన్నారు.

ఇద్దరు విద్యార్థినులకు జగనన్న ఆణిముత్యం అవార్డు


షేక్ షమీమా


కడియాల హర్షిత

దొనకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థిని షేక్ షమీమా జగనన్న ఆణిముత్యం జిల్లా స్థాయి అవార్డుకు ఎంపికైంది. ఇంటర్ సీఈసీలో 938 మార్కులు సాధించిన ఆమెకు అవార్డు రావడంపై ప్రిన్సిపాల్ అనూరాధ, అధ్యాపక సిబ్బంది, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. తోటి విద్యార్థులు షమీమాను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ప్రిన్సిపాల్ కోరారు.

కొమరోలు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇటీవల 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన కడియాల హర్షిత జగనన్న ఆణిముత్యాలు అవార్డుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసకుమార్ తెలిపారు. కడియాల హర్షిత 553/600 మార్కులు సాధించి నియోజకవర్గ స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి విద్యాశాఖ మంత్రి ప్రకటించిన జగనన్న ఆణిముత్యాలు అవార్డుకు ఎంపికైందని తెలిపారు. హర్షితను ఉపాధ్యాయులు అభినందించారు.

దిశ యాప్‌తో రక్షణ


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఉష ఈశ్వరన్

మార్కాపురం: మహిళలకు, విద్యార్థినీలకు దిశ యాప్‌తో రక్షణ లభిస్తుందని ఇందిరా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఉష ఈశ్వరన్ అన్నారు. శనివారం కళాశాలలో లింగ అసమానతపై ఫ్యాకల్టీస్, స్టూడెంట్స్‌కు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటి నుంచి బయటకి వచ్చిన మహిళలు మొబైల్లో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఆపదలో ఉన్నప్పుడు పోలీసులకు సమాచారం అందిస్తే వారు వెంటనే స్పందించి రక్షణ కల్పిస్తారని, ప్రతి ఒక్క విద్యార్థిని ఖచ్చితంగా దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. మహిళల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చిందని, నిందితులను కఠినంగా శిక్షిస్తున్నారని అన్నారు. వివిధ ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన 150 మంది అధ్యాపకులు, 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా

చెన్నకేశవునికి శాంతి కల్యాణం


ప్రత్యేక అలంకారంలో ఉభయ దేవేరులతో చెన్నకేశవ స్వామి వారు


రేగడపల్లిలో అలంకరణలో శ్రీవారు


పూజలందుకుంటున్న పోలేరమ్మతల్లి

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి శాంతి కల్యాణం అర్చకులు శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు చేశారు. అలాగే రాజ్యలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 11 గంటలకు ఆలయ మధ్య రంగ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ప్రత్యేక పూల అలంకరణలో ఉభయదేవేరులతో చెన్నకేశవ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేద మంత్రాల మధ్య చెన్నకేశవ స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో జీ.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ పీ.కేశవరావు, ధర్మకర్తలు, గౌరవాధ్యక్షుడు రామడుగు కోటేశ్వరరావు, కోశాధికారి పెరుమాళ్ల కోటేశ్వరరావు, కార్యదర్శి రామడుగు వెంకట సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

భక్తి పరవశం

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు పంచాయతీ నాయుడుపేట గ్రామంలో శనివారం అత్యంత భక్తి శ్రద్ధలతో బంగారమ్మ తల్లి, పోలేరమ్మతల్లి జాతర ఉత్సవాలను నిర్వహించారు. వేకువజాము నుంచి అమ్మవార్లను దర్శించి, మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు నైవేద్యాలు తయారు చేసి, గ్రామంలో ఉత్సవం నిర్వహించారు. తొలుత రామాలయం వద్ద బొడ్డురాయికి పూజలు చేసి ఊరేగింపుగా వచ్చి, అమ్మవారికి నైవేద్యాలు చెల్లించారు. సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలతో గ్రామం పచ్చగా ఉండాలని ఏటా అమ్మవారి ఉత్సవాలు చేస్తున్నారు. గుంటూరు, ఒంగోలు, నంద్యాల తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

శ్రీవారికి పూజలు..

మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రసాదాచార్యులు వెంకటేశ్వర స్వామికి పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వర స్వామి ఆలయంలో అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

పోలేపల్లిలో పోలేరమ్మ తిరునాళ్ల

దొనకొండ: మండలంలోని పోలేపల్లిలో గ్రామస్తులు పోలేరమ్మ తిరునాళ్లను శనివారం ఘనంగా నిర్వహించారు. పెద్దలు, పిల్లలు పోలేరమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. తమ గ్రామాన్ని చల్లగా చూడాలమ్మా, పాడి పంటలు సమృద్ధిగా పండాలని, పిల్లా పాపలు సుఖ సంతోషాలతో జీవించాలని అమ్మవారిని కోరుకున్నారు. గ్రామస్తులు అన్నదానం చేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


బంగారమ్మ ఆలయం వద్ద భక్తులు


కళ్యాణంలో పాల్గొన్న భక్తులు

నేడు శ్రీనాగ అభయాంజనేయస్వామి తిరునాళ్ల

పెద్దారవీడు: మండలంలోని ఎస్.కొత్తపల్లె సమీపంలో వెలసిన శ్రీ నాగ అభయాంజనేయస్వామి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. స్వామి వారికి అభిషేకాలు, గణపతి పూజ, తదితర పూజలు నిర్వహిస్తారని, భక్తి పాటల భజన కార్యక్రమం, సాయంత్రం కోలాటం, భక్తుల కోసం మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే అన్నా రాంబాబు


మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

కొమరోలు: జగనన్న పాలనలో రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించారని గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు అన్నా వెంకట రాంబాబు అన్నారు. మండలంలోని రాజుపాలెం గ్రామ సచివాలయ పరిధిలోని జి.వెంకటాపురం, ద్వారకచర్ల గ్రామాల్లో శనివారం నిర్వహించిన 110వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయా గ్రామాల్లోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించడంతో పాటు స్థానికంగా ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే అన్నా రాంబాబు మాట్లాడుతూ ప్రజలకు ఏ సమస్య వచ్చినా తన దష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. కరోనా కష్టకాలంలోనూ ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో సంక్షేమ పథకాలు రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడా ఆపలేదన్నారు. అమ్మఒడి, వైఎస్సార్ ఫించన కానుక, చేయూత, ఆరోగ్యశ్రీ, ఆసరా, వాహనమిత్ర, విద్యాదీవెన, వసతి దీవెనతో పాటు పేదలందరికీ ఇళ్లు వంటి హామీల్లో లేని ఎన్నో సంక్షేమ పథకాలను జగనన్న ప్రవేశపెట్టి సమర్థంగా అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. మూడున్నరేళ్ల పాలనలో జరిగిన అభివృని చూసి మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఎమ్మెల్యే అన్నా రాంబాబు ప్రజలను కోరారు. జెడ్పీటీసీ సారె వెంకట నాయుడు, సర్పంచ్‌లు హటేల్ పీరా, ప్రదీప్, రమణరెడ్డి, వైస్ ఎంపీపీ షేక్ మౌలాలీ, ఎంపీటీసీలు రమణమ్మ, షేక్ సుభానీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జనార్దన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

జగనన్న పరిపాలన దేశానికే ఆదర్శం!

- కాటూరివారిపాలెం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి


కాటూరివారిపాలెంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ

పొదిలి రూరల్: దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలను మన రాష్ట్రంలో అమలు చేస్తూ, అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శమని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. పొదిలి నగర పంచాయతీ సచివాలయం-6 పరిధిలోని కాటూరివారిపాలెంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అధికారులు, ప్రజాప్రతినిధులకు స్థానిక నాయకులు కాటూరి అశోక్, గంజాశ్రీను స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి, సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కలిగిన ప్రయోజనాన్ని వివరించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే చెప్పమనగా నీరు, డ్రైనేజీ, పింఛన్లపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలు పరిష్కరించేలా ప్రణాళికలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీలను మేనిఫెస్టోలో పెట్టి తప్పకుండా అమలు చేశారన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజలకు వేగంగా, సులభంగా సేవలు అందిస్తున్నామని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన నవరత్నాల పథకాలు నిరుపేదలకు బతుకుల్లో వెలుగు నింపాయన్నారు. ప్రభుత్వాన్ని విమర్శించే వారికి ప్రజలే సమాధానం చెబుతారన్నారు. దాదాపు 360 గృహాలను సందర్శించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ డానియల్ జోసఫ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కసిరెడ్డి రమణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, పట్టణ కన్వీనరు నూర్జహాన్ బేగం, కల్లం సుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సాయి రాజేశ్వరరావు, మాజీ కన్వీనర్లు జి శ్రీనివాసులు, జి సంజీవరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ గుజ్జుల రమణారెడ్డి, కె సుబ్బారావు, మాజీ ఎంపీపీ కే నరసింహారావు, గూడూరి వినోద్, మండలపు శ్రీనివాసరెడ్డి, వార్డు అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, సర్పంచ్‌లు, అనుబంధ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

యర్రగొండపాలెం: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆదివారం మండలంలోని గుర్రపుశాల పంచాయతీ గంగుపల్లిలో ఉదయం 7 గంటలకు జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి తెలిపారు. అనంతరం ఉదయం 11 గంటలకు ఆ గ్రామంలో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన ప్రారంభిస్తారు. సాయంత్రం 4 గంటలకు యర్రగొండపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం ఆడిటోరియంలో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

నాగెళ్లముడుపులో కూడా..

తర్లుపాడు: మండలంలోని నాగెళ్లముడుపు సచివాలయం పరిధిలోని నాగెళ్లముడుపు, పత్తెపురం గ్రామాల్లో ఉదయం 7 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రామాంజనేయరెడ్డి తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మండల స్థాయి అధికారులు, పార్టీ నాయకులు పలువురు పాల్గొంటారని తెలిపారు.

చట్టాలపై అవగాహన ఉండాలి


వృద్ధులతో మాట్లాడుతున్న జడ్జి

గిద్దలూరు రూరల్: చట్టాలపై అవగాహన ఉండాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పీఆర్ కాలనీలో సంజీవిని అనాథ వృద్ధాశ్రమంలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. జీవితంలో ఎన్నో ఒడిదొడుకులు అనుభవించి చివరి దశలో వృద్ధులు అనాథ ఆశ్రమంలో ఉండటంపై ఆయన స్పందించారు. ఆశ్రమంలో వసతుల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. చట్టం మీకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరిసారాధానమ్మ సబ్ జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీలతో వసతుల ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదులు పిచ్చయ్య యాదవ్, రవిప్రకాష్, జైలు సూపరింటెండెంట్ రవింద్రనాథ్, కోర్టు సిబ్బంది వరలక్ష్మి, అద్దంకి మధు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నియంత్రించాలంటూ అవగాహన

పెద్దదోర్నాల: ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాలంటూ మండల కేంద్రంలో శనివారం అటవీశాఖ అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీ చేస్తూ హోటళ్లు, కూరగాయల బండ్లు, టిఫిన్ స్టాల్స్ తదితర వర్తక దుకాణాల వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రీశైలం రోడ్డులోని గణపతి చెక్‌పోస్టు వరకు 2 కిలోమీటర్ల మేర ర్యాలీ చేశారు. ర్యాలీలో ఫారెస్ట్ రేంజి అధికారి విశ్వేశ్వరరావు, డీఆర్వో ఆరిఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

అర్ధవీడు (కంభం): ప్రజాసమస్యల పరిష్కారం కోసం అధికారులు బాధ్యతగా పనిచేయాలని ఎంపీపీ వెంకట్రావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మూడు నెలలకోసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి పలు శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమ పరిధిలోని పలు సమస్యలను సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు వస్తారని, అలాంటి సమయంలో మండల స్థాయి అధికారులు సమావేశానికి హాజరు కాకుంటే సమస్యలు ఎవరికి చెప్పాలని ఎంపీపీ నిలదీశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించేలా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ వీరభద్రాచారి, జెడ్పీటీసీ సభ్యురాలు చెన్ను విజయ, వ్యవసాయాధికారి మహ్మద్, ఉద్యానవన అధికారి శ్వేత, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

'స్పందన'ను పర్యవేక్షించిన ప్రత్యేకాధికారి

గిద్దలూరు రూరల్: కలెక్టర్ దినేష్‌కుమార్ ఈ నెల 22వ తేదీన స్థానిక నంద్యాల రోడ్డులోని సీఎస్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేయనున్న స్పందన కార్యక్రమం ఏర్పాట్లను నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎం.రామసుబ్బయ్య, తహసీల్దార్ కె.విజయకుమారిలు శనివారం పర్యవేక్షించారు. స్పందన కార్యక్రమంలో ప్రజలు, అధికారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించాలన్న ఉద్దేశంతో కార్యక్రమ ఏర్పాట్లను వారు పరిశీలించారు.

సామాజిక న్యాయాన్ని అమలు చేయాలి


బీసీ వాయిస్ పత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

మార్కాపురం టౌన్: ప్రభుత్వాలు రాజ్యాంగంలో పేర్కొన్న సామాజిక న్యాయాన్ని అమలు చేస్తూ సమ సమాజ స్థాపనకు కృషి చేయాలని హైకోర్టు సీనియర్ న్యాయవాది వై కోటేశ్వరరావు అన్నారు. శనివారం ప్రెస్ క్లబ్‌లో బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీసీ ఉద్యోగుల చైతన్య సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీసీ ఉద్యోగులకు ప్రమోషన్‌లలో రిజర్వేషన్లు కల్పించాలని, క్రిమి లేయర్‌ను రద్దు చేయాలని, జనాభా దామాష ప్రకారం బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్ కల్పించాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు పీసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బీసీ జనాభా లెక్కలు చేపట్టి సంక్షేమ ఫలాలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ వాయిస్ మాస పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు టీపీ వెంకటేశ్వర్లు, ఎన్ శ్రీనివాసులు, రంగ నాయకులు, పిన్నిక ప్రసాద్, రజినీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ తిరునాళ్లకు సర్వం సిద్ధం

కురిచేడు: స్థానిక కోట బజారులో వేంచేసి ఉన్న శ్రీ పోలేరమ్మ తల్లి తిరునాళ్ల ఆదివారం వైభవంగా జరగనుంది. తిరునాళ్ల సందర్భంగా తాగునీరు, అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

విరిగిన స్తంభం.. నిలిచిన విద్యుత్ సరఫరా

ముండ్లమూరు: మండలంలోని ఈదర సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు ఈదర-అయోధ్యనగర్ మధ్యలో 11కేవీ విద్యుత్ స్తంభం మధ్యకి విరిగి పడింది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి అయోధ్యనగర్, ఈదర, రమణారెడ్డిపాలెం, వేముల, కొమ్మవరం, బొప్పూడివారిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా రాత్రి రెండు గంటల నుంచి నిలిచి పోయింది. రాత్రి వేళ ఈదురుగాలులు, వర్షం కురవడంతో విద్యుత్ స్తంభం విరిగి పడింది. ఈయా గ్రామాలకు సరఫరా నిలిచింది. సిబ్బంది అర్ధరాత్రి ఎక్కడ సమస్య ఉందో గుర్తించలేక పోయారు. శనివారం ఉదయం సిబ్బంది లైన్ల వెంబడి పరిశీలించగా మధ్యలో స్తంభం విరిగి పోవడంతో పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. శనివారం సాయంత్రానికి కూడా విద్యుత్ సరఫరా లేకపోవడంతో వేసవి కావడంతో నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

తెల్లబాడులో చలివేంద్రం ఏర్పాటు

దొనకొండ: వేసవిని దృష్టిలో ఉంచుకుని తెల్లబాడులో సర్పంచ్ యామిని బాలిరెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు శనివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రతి సంవత్సరం తమ పంచాయతీలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. యామిని శ్రీనివాసరెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

క్షేత్రసహాయకులు బాధ్యతగా పనిచేయాలి

ముండ్లమూరు: ఉపాధి పథకంలో పని చేస్తున్న క్షేత్రసహాయకులు బాధ్యతగా పని చేయాలని ఎంపీపీ సుంకర సునీత అన్నారు. నూతనంగా ఎంపికైన క్షేత్ర సహాయకులకు స్థానిక ఎంపీపీ కార్యాలయంలో శనివారం నియామక పత్రాలు ఆమె అందజేశారు. వేములబండకు దుగ్గినేని వెంకటేష్, బృందావనం తండాకు హంనేశ్వర్ నాయక్‌లను నియమించినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుంకర బ్రహ్మారెడ్డి, మాజీ సర్పంచ్ రామానాయక్, ఏపీఓ కొండయ్య, సాంకేతిక సహాయకుడు అశోక్ పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ సమావేశం

కొనకనమిట్ల: ఈ నెల 22న సోమవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రావూరి జనార్దన్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో గ్రామాల అభివృద్ధిలో తీసుకోవాల్సిన అంశాలపై అన్నీ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షిస్తారని, అధికారులు వారి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలన్నారు. సమావేశానికి నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ.నాగార్జునరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని అన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్‌లు, కో ఆప్షన్ సభ్యులు హాజరు కావాలని ఎంపీడీఓ జనార్ధన్ కోరారు.

డ్రోన్‌తో భూ సమస్యల పరిష్కారం


డ్రోన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అన్నా

గిద్దలూరు రూరల్: డ్రోన్ సర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం డ్రోన్ సర్వే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎలాంటి భూ వివాదాలకు తావులేకుండా డ్రోన్ కెమెరా సర్వే ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. ఆధునిక పరికరాలతో డ్రోన్ కెమెరా ద్వారా సర్వే చేపట్టి ఆ తర్వాత క్షేత్ర స్థాయిలో రెవెన్యూ సర్వే సిబ్బంది హద్దులు నిర్ణయిస్తారన్నారు. భూ హక్కు పత్రాల్లో క్యూ ఆర్ కోడ్, మ్యాప్‌ల ఫొటోలు, విస్తీర్ణం, సర్వే నంబర్లతో పూర్తిగా సర్వే చేస్తారని చెప్పారు. రైతులకు చెందిన ప్రతి భూమి వివరాలను క్షుణ్ణంగా అందులో పొందుపరిచేందుకు వీలు ఉంటుందని పేర్కొన్నారు. ఇటువంటి పథకాన్ని ప్రవేశపెట్టిన జగనన్న నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, తహసీల్దార్ కొమ్ము విజయకుమారి, కమిషనర్ వై.రామకృష్ణయ్య, సర్వేయర్ శ్రీనివాసరావు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.